క్లుప్తంగా

రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



యానాంలో కొలువైన వేంకటేశ్వర స్వామి

యానాం: భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ప్రారంభోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి వచ్చే ఏడాది జనవరి 13 వరకు వివిధ పూజా కార్యక్రమలను నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆలయ అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, మూల విరాట్టుకు విశేష అలంకరణ, కుంకుమార్చన జరుగుతాయన్నారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటాయని నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేసిన యువకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక బుద్ధాల బ్లడ్ బ్యాంక్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 23 మంది రక్త దానం చేశారు. ఈ కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, సాయి విశ్వాస్ హాస్పిటల్ వైద్యుడు గంధం విశ్వనాథ్, క్యాపిటల్ హాస్పిటల్ వైద్యుడు ఎన్. విజయకుమార్, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చేట్ల మంగతాయారు, వీర లక్ష్మీదుర్గ, చీకట్ల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు

అమలాపురం రూరల్: స్థానిక శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తమ సామాజిక వర్గంలో అనారోగ్యం పాలైన రోగులు, ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులకు తమ వంతు సాయం చేసేందుకు ముందుకు వస్తుందని హెల్పింగ్ హాండ్స్ గ్రూపు ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం రూరల్ మండలం నడిపూడి శివారు బొక్కావారి పాలెంలో నిరుపేద కుటుంబానికి చెందిన కొప్పిశెట్టి నాగేంద్రరావు (30) ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి తమ వంతు సాయంగా శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సేకరించిన రూ.1.60 లక్షల నగదును ఆదివారం సాయంత్రం నడిపూడి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సంస్థ ప్రతినిధులు సంసాని బులినాని, దొమ్మేటి రాము, జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి పిల్లి నాగ గోపాల కృష్ణ, శెట్టిబలిజ నాయకులు బొక్కా ఆదినారాయణ, విత్తనాల ఇంద్ర శేఖర్, చెల్లుబోయిన నాని, దంగేటి రుద్ర ప్రసాద్, కేతా భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

నాణేల సేకరణ కర్తలకు సత్కారం



సేకరణ కర్తలను సత్కరిస్తున్న అతిథులు

అమలాపురం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో యూత్ హాస్టల్ అసోసియేషన్ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమలాపురానికి చెందిన నాణేలు, తపాలా బిళ్లలు, కరెన్సీ నోట్ల సేకరణ కర్తలు పుత్సా కృష్ణ కామేశ్వర్, చక్కా సత్యనారాయణలు నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. యూత్ హాస్టల్ అసోసియేషన్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సేకరణ కర్తలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం వారిద్దరినీ యూత్ హాస్టల్స్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ మనోజ్ జోష్రా, జాతీయ కార్యదర్శి రవిశంకర్ తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు.

దర్జాగా సబ్ లీజు వ్యాపారం..!

- మున్సిపాలిటీ వ్యాపార సముదాయాల్లో లీజుదారుల దందా
- రెట్టింపు అద్దెలు వసూలు చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి చెందిన షాపుల్లో కొందరు లీజుదారులు ఏళ్ల తరబడి తిష్ట వేసుకుని కూర్చుకున్నారు. మున్సిపాలిటీకి ఉన్న 101 షాపుల్లో సగానికి పైగా అసలు లీజుదారులు వేరే వ్యాపారులకు సబ్ లీజుకు ఇచ్చి పరోక్షంగా రెట్టింపు అద్దెలు వసూలు చేస్తూ వ్యాపారాలు చేస్తున్నారు. సబ్ లీజులతో కొందరు లీజుదారులు మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ సొంత లీజు వ్యాపారాలతో దోపిడీకి పాల్పడుతున్నారు. గత నెల జరిగిన కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా సబ్ లీజుల వ్యవహారంపై ధ్వజమెత్తడంతో సబ్ లీజుల రగడ తెరపైకి వచ్చి వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మీ–సేవా కేంద్ర భవనాన్ని ఓ బడా వ్యాపార సంస్థకు సబ్ లీజుకు ఇచ్చిన విషయం సైతం వివాదమైంది. మీ–సేవా భవనాన్ని ఓ కాంట్రాక్టర్ మున్సిపాలిటీ నుంచి రూ.80 వేలకు అధికారికంగా పొడుకుని ఓ బడా సంస్థకు మరి కొంత అద్దె పెంచి అనధికారికంగా సబ్ లీజుకు ఇవ్వడంమై కౌన్సిలర్లు గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. రాజకీయ అడకత్తెరలో అధికారులు ఈ విషయంలో నలిగిపోయి కౌన్సిల్‌కు సమాధానం చెప్పుకోలేక నీళ్లు నమిలిన పరిణామాల నేపథ్యంలో అసలు మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో నెలకొన్న సబ్ లీజులపై పట్టణ ప్రజలు చర్చించుకునే పరిస్థితి ఏర్పడింది.



అమలాపురం మున్సిపల్ కార్యాలయ భవనం

డిమాండ్ రూ.కోటి.. సబ్ లీజులతో మరో రూ.కోటి

మున్సిపాలిటీకి ఉన్న 4 షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా లీజుల రూపేణా దాదాపు రూ.కోటి ఆదాయం అధికారికంగా వస్తోంది. అవే షాపులను ఏళ్ల తరబడి పొడుకుంటూ తమ కన్నుసన్నల్లోనే వాటిని ఉంచుకుని సబ్ లీజుల ద్వారా అనధికారికంగా మరో రూ.కోటి ఆదాయం పొందుతున్నారు. ఈ షాపులకు మున్సిపాలిటీ పరంగా రూ.8 వేలు నుంచి రూ.16 వేలు వరకూ ఆయా షాపుల విస్తీర్ణాన్ని బట్టి మున్సిపల్ రెవెన్యూ విభాగం అద్దె వసూలు చేస్తోంది. మున్సిపాలిటీలో అతిపెద్ద షాపింగ్ కాంప్లెక్స్ అయిన పొట్టి శ్రీరాములు షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్)లో 55 షాపులు ఉన్నాయి. ఇందులో మూడొంతులు షాపులు సబ్ లీజుల దందాతోనే సాగుతున్నాయి. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో అధికార లీజుదారులుగా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సానుభూతి పరులే ఎక్కువ మంది ఉండడం గమనర్హం. రాజకీయ నేతల అండదండలతో వీరు లీజుదారులుగా కొనసాగుతూ వస్తున్నారు. కొందరు లీజుదారులైతే రెండు నుంచి మూడు షాపులు కూడా పొడుకుంటున్నారు. పైసా పెట్టుబడి లేకుండా షాపులను మున్సిపాలిటీ నుంచి లీజుకు తీసుకోవడం అదే షాపును వేరే వ్యాపారికి రెట్టింపు సబ్ లీజుకు ఇచ్చి ఇంట్లో కూర్చుని దర్జాగా వ్యాపారాలు చేస్తున్నారు. మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లు వీరికి వ్యాపార వస్తువులుగా, సొంత జాగీర్లుగా మారిపోయాయి.

రూ.26 లక్షల బకాయిలు

సబ్ లీజులు తీసుకుని ప్రైవేటుగా లీజుదారులు వ్యాపారాలు చేసి అయాచితంగా లాభాలు ఆర్జిస్తున్నా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అసలు లీజును మాత్రం చెల్లించేందుకు కొందరు లీజుదారులకు మనసు ఒప్పడం లేదు. దీంతో మున్సిపాలిటీకి షాపుల అద్దెల ద్వారా ప్రస్తుతం రూ.26 లక్షలు బకాయిలు ఉన్నాయి. ఫలానా షాపు ఎవరు తీసుకున్నారో, సబ్ లీజుతో నెలా నెలా ఎంత అద్దె వసూలు చేసుకుంటున్నారో మున్సిపాలిటీకి తెలిసినా చోద్యం చూడటం గమనార్హం. లీజుదారులు లీజు చెల్లించకుండా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నా అడిగే నాథుడే లేడు. సబ్ లీజుదారులకు ఉన్న రాజకీయ పలుకుబడితో అధికారులు నోరు మెదిపి అసలు గుట్టును రట్టు చేసే సాహసం చేయలేకపోతున్నారు. వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులకు ధైర్యం సరిపోవడం లేదు. ఇటీవల కాలంలో సబ్ లీజుల రగడ రచ్చకావడంతో మున్సిపల్ రెవెన్యూ విభాగం 101 షాపుల్లో సబ్ లీజులకు ఇచ్చిన షాపుల సంఖ్యను, సబ్ లీజులతో వసూలవుతున్న మొత్తాలను, మున్సిపాలిటీకి లీజుల ద్వారా వస్తున్న మొత్తాలపై ఓ నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమైంది.

కౌన్సిల్‌లో చర్చించి చర్యలు తీసుకుంటాం

సబ్ లీజుల వ్యవహారంపై త్వరలోనే కౌన్సిల్‌లో చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటాం. కౌన్సిల్ నిర్ణయం అయ్యాక దీనిపై చర్యలు తీసుకుంటాం. సబ్ లీజుల వ్యవహారంపై ఇటీవల కౌన్సిలర్లు సమావేశంలో ప్రశ్నించినప్పుడు ఈ అంశం వివాదంగా మారింది. దీంతో ఈ సమస్య తీవ్రతపై ప్రత్యేక దృష్టి సారించాం.

కేవీఆర్ఆర్ రాజు,
మున్సిపల్ కమిషనర్, అమలాపురం

నిర్లక్ష్యపు గుమ్మళ్లు..!



విలసవిల్లిలో విద్యుత్ స్తంభం తీగలకు అల్లుకున్న పాదుల్లో కాసిన గుమ్మడి కాయలు

ఉప్పలగుప్తం: సాధారణంగా పాదుకు కాయలు కాయాలంటే సాగు చేసి పందిరి వేస్తే కాయలు కాపుకు వస్తాయి. కానీ మండలంలోని విలసవిల్లి గ్రామంలో అధికారుల నిర్లక్ష్యంతో ఏకంగా విద్యుత్ స్తంభాలకే గుమ్మడి కాయలు కాస్తున్నాయి. పాదుకున్న ఆకులు విద్యుత్ తీగలకు తగిలి పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు.

అదుపు తప్పితే ఇక అంతే..!



ఉప్పుటేరుపై ప్రమాదకరంగా మారిన కల్వర్టు

ఆధ్వాన స్థితిలో కల్వర్టు

అల్లవరం: కొమరగిరిపట్నం–ఎస్.రామేశ్వరం గ్రామాల మధ్య ఉప్పుటేరుపై రాకపోకలు సాగిస్తున్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టు నేడు కూలిపోయే స్థితిలో ఉంది. ఎస్.రామేశ్వరం గ్రామానికి రాకపోకలు చేయడానికి ఈ కల్వర్టే ఆధారం. ఈ కల్వర్టు కూలితే ఉప్పలగుప్తం మండలం వాసాలాతిప్ప నుంచి చల్లపల్లి మీదుగా రాకపోకలు చేయాల్సి వస్తుంది. అదే జరిగితే అల్లవరం మండలంలో అంతర్భాగమైన ఎస్.రామేశ్వరం నుంచి పౌర సేవల కోసం ప్రజలు అల్లవరం రావాలంటే ఇబ్బందులకు గురికాక తప్పదు. గతంలో కొమరగిరిపట్నం నుంచి ఎస్.రామేశ్వరం వరకు బీటీ రోడ్డు నిర్మించారు గానీ శిథిలమైన కల్వర్టుని మాత్రం పట్టించుకోలేదు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పలు మార్లు ప్రతిపాదనలు చేసినా నేటికీ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పక్కా వంతెనను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాలల గర్జన సభకు మేము సైతం..

కాట్రేనికోన: ఎస్సీ వర్గీకరణపై చలో గుంటూరు మాలల మహాగర్జన సభకు కాట్రేనికోన మండలం నుంచి భారీగా స్థానిక నాయకులు తరలి వెళ్లారు. మండలంలోని కాట్రేనికోన, పల్లంకుర్రు, కందికుప్ప, వేట్లపాలెం, జిల్లేళవారిపేట, అడవిపేట, చెయ్యేరు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. దళిత నాయకులు మాట్లాడుతూ మాలలు ఐక్యంగా ఉంటే సాధించలేనిది ఏదీలేదని, మాలల ఐక్యతకు పార్టీలకు అతీతంగా కలిసి పని చేయాలని పిలుపు నిచ్చారు. గుంటూరు తరలి వెళ్లిన వారిలో దళిత నాయకులు నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, గంటి వెంకట సుధాకర్, నాతి అలివేణి, నేలపాటి శ్రీరాములు, యేసురత్నం, సాపే సూర్యప్రకాష్, జగడం బాలయ్య, గిడ్డి తిరుపతి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తాళ్లరేవు: గుంటూరులో జరగనున్న మాలల మహాగర్జన కార్యక్రమానికి దళిత సోదరులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రమైన తాళ్లరేవు నుంచి మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్, మాల మహానాడుల సంయుక్త ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దళితుల మధ్య విభజన తీసుకు రావడానికి ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు. ఐక్యతకు నిదర్శనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నిరసనలకు తలొగ్గి కోర్టు తీర్పును వెనక్కు తీసుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం తప్పదన్నారు.

అమలాపురం టౌన్: గుంటూరులో ఆదివారం జరుగుతున్న మాలల మహాగర్జన సభకు జిల్లా నుంచి వేలాదిగా మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. జిల్లాలోని ప్రతి పట్టణం, గ్రామం నుంచి మాల మహానాడు కార్యకర్తలు 'చలో గుంటూరు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎక్కడికక్కడ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసుకుని వెళ్లారు. జిల్లా కేంద్రం నుంచి 25 కార్లు, 10 బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. అమలాపురం మద్దాల వారిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు బయలుదేరింది. జిల్లా ముఖ్య మాల నాయకులు డీబీ లోక్, జంగా బాబూరావు, ఎంఏకే భీమారావు, ఇసుకపట్ల రఘుబాబు, గెద్దం సురేష్‌బాబు, నాతి శ్రీనివాసరావు ఉండ్రు వెంకటేష్ గుంటూరుకు తరలి వెళ్లారు.

ముమ్మిడివరం: గుంటూరు నల్లపాడులో ఆదివారం జరిగిన మాల మహాగర్జన సభకు ముమ్మిడివరం నుంచి మాల మహానాడు నాయకులు తరలి వెళ్లారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కి సంబంధం లేకుండా ఉందని అది రాజ్యాంగ విరుద్ధమని దీనిని మాలలంతా వ్యతిరేకించాలన్నారు. తరలి వెళ్లిన వారిలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కాశి జగపతిరావు, దేవరపల్లి ఏడుకొండలు, చీకురుమిల్లి శ్రీనివాస్, జనిపెల్ల సత్యనారాయణ, మట్టా శ్రీను,ఎం.ఆశీర్వాదం తదితరులున్నారు.



కాట్రేనికోన నుంచి గుంటూరు మాలల గర్జనకు తరలి వెళుతున్న దళిత నాయకులు



తాళ్లరేవు నుంచి గుంటూరు తరలి వెళుతున్న దళిత నాయకులు



అమలాపురం పట్టణం మద్దాలవారి పేట నుంచి గుంటూరు మాలల గర్జనకు బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

విపత్తులను ఎదుర్కోవడంలో విఫలం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఇటీవల ఫెంగల్ తుపాను సృష్టించిన వరదలు తదనంతర పరిణామాలను ఎదుర్కోవడంలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ సీఎం నారాయణసామి విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుపాను, వరదల వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అపార నష్టం సంభవించినప్పటికీ సహాయం అందించడంలో ప్రభుత్వ విఫలమయ్యిందన్నారు. తమిళనాడు లో వచ్చిన విపత్తు గురించి ప్రధాని మోదీ ఫోన్ ద్వారా సీఎం స్టాలిన్‌తో మాట్లాడారని కానీ పుదుచ్చేరి సీఎం రంగసామితో కనీసం మాట్లాడలేదని ఆరోపించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి కేవలం 15 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మద్దతుగా ఉన్నారని, ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో సీఎం రంగసామి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వృద్ధురాలికి సాయం

యానాం: నియోజకవర్గ పరిధిలో ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్న కనకాలపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు మద్దింశెట్టి ముత్యాలమ్మకు ఆదివారం ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెంకు చెందిన ఒఎస్ఎస్ ఎంటర్ ప్రైజస్ సంస్థ ప్రతినిధి సూరప్పరెడ్డి సురేష్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిరవూరి వెంకేశ్వరరాజు, పోలిశెట్టి చిట్టినాయుడు, సుంకర కృష్ణ పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం

హాజరు కానున్న 30 మంది ఎమ్మెల్యేలు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ తొలిసారిగా సోమవారం యానాంలో సమావేశం కానుంది. ఈ సందర్భంగా స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకౌంట్స్ చైర్మెన్, ఎమ్మెల్యే కెఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో 'ఆడిట్ సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్' జరగనుంది. ఈ సమావేశంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులతో పాటు అంచనాల కమిటీ సభ్యులు పాల్గొననున్నారు. పుదుచ్చేరి అసెంబ్లీలోని వివిధ పార్టీలైన ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే తదితర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. స్పీకర్ ఆర్ సెల్వం, డిప్యూటీ స్పీకర్ రాజవేలు తదితరులు హాజరు కానున్నారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు పుదుచ్చేరి నుంచి వచ్చిన స్పీకర్ సెల్వం, చైర్మన్ రమేష్ తదితరులకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు రాజమహేంద్రవరం విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

ప్రశాంతంగా కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష

యానాం: పుదుచ్చేరి సహకార శాఖలో కో ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ పరీక్షా కేంద్రంగా జరిగిన ఈ పరీక్షకు మొత్తం 313 మంది అభ్యర్థులకు గానూ 174 మంది హాజరయ్యారు. ఆర్ఏఓ మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ అండర్ సెక్రటరీ మురుగేషన్, డీపీఆర్ వింగ్ ఆఫీసర్ శంకరలింగం తదితరులు పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎస్పీ రాజశేఖరన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

'అముడా'లో రెండు పట్టణాలు చేర్చేందుకు కృషి

అమలాపురం టౌన్: జిల్లాలో ఏర్పడ్డ అమలాపురం డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలోకి ప్రస్తుతం రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా)లో జిల్లాలోని రామచంద్రపురం, మండపేట పట్టణాలను చేర్చేందుకు కృషి జరుగుతోందని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. జిల్లాను ఒక యూనిట్‌గా చేసి భవనాలు, లే అవుట్ల అతిక్రమణల అదుపునకు అముడా నిబంధనలకు లోబడి పని చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. అముడా చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన అల్లాడ స్వామినాయుడు ప్రమాణ స్వీకారం అమలాపురంలోని కాపు కల్యాణ మండపంలో ఈ నెల 18వ తేదీ ఉదయం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక మెబర్లీపేటలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు అధ్యక్షతన ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకార సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 18న జరిగే ప్రమాణ స్వీకారోత్సవ సభకు జిల్లాలోని పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని అముడా చైర్మన్ స్వామినాయుడు విజ్ఞప్తి చేశారు.

గ్రాండ్ మాస్టర్ గుకేష్‌కు అభినందన

అమలాపురం రూరల్: కేవలం 18 ఏళ్లకే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించి చరిత్ర సృష్టించిన తెలుగు తేజం ఇండియన్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్‌కు చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్ర కుమార్ అభినందించారు. అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి గుకేష్ చిత్రాన్ని వేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

అమరజీవి త్యాగం అజరామరం



అమలాపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఆర్యవైశ్య నాయకులు



యానాంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



అమలాపురంలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అమలాపురం టౌన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని అమలాపురం ఆర్యవైశ్య నాయకులు అన్నారు. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో గల అమరజీవి విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు పూల మాలలు వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన త్యాగాలను కొనియాడారు. ఆర్య వైశ్యుల కుల దైవమైన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని సైతం ప్రభుత్వ పరంగా నిర్వహించాలని సంకల్పించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, కార్యదర్శి నంబూరి మూర్తి, ఆర్యవైశ్య నాయకులు వరదా సూరిబాబు, అప్పన వీరన్న, కేవీ మావుళ్లయ్య తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న సంగీత దర్శకుడు సాలూరు వాసురావు

యానాం: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సమాచార శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఫెర్రీరోడ్డులోని ఆయన విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు అన్నారు. శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ సర్క్యులర్ బజార్ వద్ద శ్రీరాములు విగ్రహానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు, జనసేన నాయకులు పడాల వెంకటేశ్వరరావు, కే.భీమా శంకర్ తదితరులు నివాళులర్పించారు.

అమలాపురం రూరల్: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైన పొట్టి శ్రీరాములు భావి తరాలకు ఆదర్శప్రాయుడని ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు వాసురావు కొనియాడారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా సమైక్య భారతి ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు నల్లా పవన్ కుమార్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు గాయకులతో నిర్వహించిన మధుర గీతాల సంగీత విభావరి అలరించింది. పశ్చిమ బెంగాల్ ఖరగ్‌పూర్ తెలుగు జాతి ఐక్యవేదిక కార్యదర్శి ఆర్.మురళి, గిడుగు రామమూర్తి ముని మనుమడు గిడుగు నాగేశ్వరరావు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు గోదశి గంగరాజు, హిందీ శాఖాధిపతి నల్లా సత్యనారాయణ, వాసవీ క్లబ్ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, సమైక్య భారతి ఉభయ గోదవరి జిల్లా అధ్యక్షుడు కె.గౌరీ నాయుడు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్. రాజు, గోకరకొండ నాగేంద్ర, రవణం వేణుగోపాలరావు, ఆకుల రవితేజ, తదితరులు పాల్గొన్నారు.